17వ వసంతంలోకి
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
సోమవారం | 22 జులై 2024 | పేజీలు 9


## ఎల్లమ్మకు సారె సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు

- మొక్కులు చెల్లించుకున్న పులివర్తి నాని, సుధా రెడ్డి దంపతులు
- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు, నూతన కమిటీ సభ్యులు
- ఆలయ కుంభాభిషేక పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే దంపతులు, నూతన కమిటీ సభ్యులు, ఈఓ
- ఆలయ నిర్మాణాన్ని పరిశీలించి పలు మార్పులను అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

వివరాలు 8లో



## ప్రభుత్వ ఉద్యోగం పేరుతో
# రూ:6 లక్షల శఠగోపం

- నాలుగేళ్లుగా బాధితులు నిరక్షణ
- అప్పులు చేసి ప్రభుత్వ ఉద్యోగానికి ఆశపడి రూ.6లక్షలు ఇచ్చాం... బాధితులు ఆందోళన
- కాలం వెల్లబీస్తున్న మోసగాళ్ళు... వడ్డీ వ్యాపారస్తులకు వడ్డీకట్టలేక అవస్తులు
- బంగారం, పశువులు, మోటార్ బైక్‌లు అమ్మి వడ్డీలు చెల్లింపు
- మోసగాళ్లపై బాధితులు ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవిన్స్ రిడ్రెస్సల్) లో ఫిర్యాదు

**బంగారుపాళ్యం, మేజర్‌న్యూస్:**

ప్రభుత్వ విద్యుత్ శాఖలో షిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగం ఇప్పిస్తామని రూ.6 లక్షలు తీసుకొని నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ ఉద్యోగం ఇపిపంచకుండా శఠగోపంపెట్టి మోసంచేశారని చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంపరిధిలో మంగళపల్లి హరిజనవాడలోని ఎ.భాస్కరయ్య భార్య ఎ.జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలు తెలిపిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తిరుపతి జిల్లా తిరుపతి పట్టణనికి చెందిన ఎస్.వెంకటేశ్వర్ రెడ్డి (ఎస్‌వి రెడ్డి) (భారతీయ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్‌మేనేజర్), చిత్తూరు జిల్లా కట్టమంచి హరిజనవాడకి చెందిన ఆర్.రంగారావు కుమారుడు ఆర్.రోహిత్ అనే ఇద్దరు వ్యక్తులు కలసి ప్రభుత్వ విద్యుత్ శాఖలో షిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగాలు తిరుపతి, చిత్తూరు, పెనుమూరు, పచ్చికాపాలం తదితర ప్రాంతాలలో ఖాళీగా ఉన్నాయని ఆ ఉద్యోగం కావాలంటే రూ.6 లక్షలు లంచం ఇవ్వాలని ఆర్.రోహిత్




ఎ.జ్యోతి కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఎ.జ్యోతి పెద్దకుమారుడు ఎ.శరన్ కుమార్ డిగ్రీ వరకు చదువుకొని నిరుద్యోగిగా ఇంటి దగ్గర ఉన్నాడు. శరన్ కుమార్‌కు ప్రభుత్వం విద్యుత్ శాఖలో షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగం వస్తే స్థిరపడుతాడని ఆశపడి ఎ.జ్యోతి వడ్డీ వ్యాపారస్తుల

మిగతా 2లో

# బార్లలో మద్యం ప్రియుల దోపిడీ



- ప్రభుత్వ నిబంధనలకు తూట్లు.. అధిక ధరలకు మద్యం విక్రయాలు
- ముఖ్య అధికారులకు ఆమ్యామ్యాలు

**చిత్తూరు బ్యూరో, మేజర్‌న్యూస్:**

జిల్లాలో మద్యం బార్లలో మందు ప్రియులను యదేచ్ఛగా దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను అడ్డుగోలుగా ఉల్లంఘించి ఖజానాకు గండి కొడుతున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలలో అనుసరిస్తున్న నిబంధనల కారణంగా బార్ల నిర్వహకులకు కాసుల వర్షం కురిపిస్తోంది. అంతేకాకుండా కొంతమంది మద్యం దుకాణాలలోని విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు సిబ్బంది బెల్టు షాపులను సైతం పెంచి పోషిస్తున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల మేరకు దుకాణాన్ని మోసే సమయంలోగా కేవలం 10 నుండి 20 మందికి మామూలుగా విక్రయిస్తూ మిగిలిన స్టాక్ అంతా కూడా బాటిల్స్‌పై రూ.50లు అనధికార ధరతో ఒకరికో ఇద్దరికో పెద్ద మొత్తంలో విక్రయిస్తున్నారన్న సమాచారం కూడా చక్కర్లు కొడుతోంది. అలాగే ప్రభుత్వం మద్యం దుకాణాలు మూసివేసిన తర్వాత బార్లలో అధిక ధరలకు గేట్లు ఎత్తివేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30పైగా బార్లు అనుమతులు పొంది ఉన్నాయి. అయితే బార్లలో మద్యం విక్రయాలు కేవలం కొలతలలో మాత్రమే మద్యపాన ప్రజలకు అందించాలి. అయితే బార్ల యజమానులు నిబంధనకు తూట్లు పొడుస్తూ వారి ఇష్టానుసారం మందు బాబులకు మద్యం అందిస్తున్నారు. అలాగే ప్రభుత్వ



మిగతా 2లో

## ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో తాళం వేసిన ఇల్లు పదిలం

జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు



వివరాలు 2లో

## ద్రౌపతి దేవి సమేత ధర్మరాజుల స్వామి అగ్నిగుండ మహోత్సవం

2లో

## శాస్త్రోక్తంగా జీయర్ల చాతుర్మాస దీక్ష సంకల్పం

**తిరుమల, మేజర్‌న్యూస్:**

తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం తిరుమల పెద్దజీయం నేతృత్వంలో చాతుర్మాస దీక్ష సంకల్పం జరిగింది. తిరుమల పెద్దజీయర్‌స్వామి మాట్లాడుతూ శ్రీవైష్ణవ సంప్రదాయకర్త రామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాసదీక్ష విశేషమైందన్నారు. ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్లి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి రోజున మేల్కొంటారని తెలిపారు. కావున ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాసం అంటారని, చాతుర్మాస వ్రతం ప్రాచీనకాలం నుండి ఆచరణలో ఉన్నట్లు పురాణాల ద్వారా తెలుస్తోందని వివరించారు. అంతకుముందు పెద్దజీయర్‌స్వామి మఠంలో కలశస్థాపన, కలశపూజ, విష్వక్సేనారాధన, మేదినిపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తరువాత సేకరించిన పుట్టమన్నుకు ప్రత్యేక పూజలు నిర్వహించి చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అనంతరం పెద్దజీయర్ తిరుమల బేడి ఆంజనేయస్వామివారి ఆలయం పక్కనగల జీయర్ మఠం వద్ద నుండి చిన్నజీయర్



మిగతా 2లో




## శాస్త్రోక్తంగా జీయర్ల చాతుర్మాస దీక్ష సంకల్పం

(మొదటిపేజీ తరువాయి)



ఇతర శిష్యబృందంతో బయల్దేరారు. తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ వరాహస్వామివారిని దర్శించుకున్నారు. అక్కడినుంచి మంగళ వాయిద్యాలతో శ్రీవారి ఆలయానికి విచ్చేశారు. శ్రీవారి ఆలయ మహద్వారం వద్ద టీటీడీ ఈఓ జె.శ్యామల రావు, జేఈఓ వీరబ్రహ్మం సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. జీయంగార్లు శ్రీవారిని దర్శించుకున్న తరువాత పెద్దజీయర్‌కి మేల్‌చాట్ వస్త్రాన్ని, చిన్నజీయర్ ఉల్‌చాట్ వస్త్రాన్ని బహూకరించారు. అనంతరం పెద్దజీయర్ మఠంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి కలిసి ఈవో, జేఈఓలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

**తొట్టంబేడు, మేజర్‌న్యూస్:** తొట్టంబేడు మండలం కాసరం పంచాయతీ రాంబట్లపల్లి గ్రామం షిరిడి సాయిబాబా మందిరంలో స్వామివారి పాలరాతి విగ్రహానికి ఉదయం నుంచి విశేషాలు పూజలు నిర్వహించి అలంకరణ చేపట్టారు. గ్రామానికి చెందిన వారే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై షిరిడి సాయినాథుని దర్శించుకున్నారు. అనంతరం హైదరాబాదుకు చెందిన మిమిక్రీ డబ్బింగ్ ఆర్టిస్ట్, ఇంద్రజాలకుడు, వెంట్రిలాక్విజం కళాకారుడు హరిప్రసాద్. మిమిక్రీ కళాకారుడు గౌతమ్ చంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం ఎంతో ఆకట్టుకుంది. అనంతరం మధ్యాహ్నం ఆలయ ధర్మకర్తలు కన్నమ్మ సింగల్ విండో మాజీ అధ్యక్షులు కే.మహదేవరెడ్డి గ్రామస్తులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా గ్రామానికి చెందిన యువ నాయకుడు కే భరత్ రెడ్డి దంపతులు సాయినాధుని దర్శించుకున్నారు. హైదరాబాదుకు చెందినమిమిక్రీ కళాకారులు హరిప్రసాద్‌ను శ్రీకాళహస్తీశ్వరుని కండువాతో సత్కరించి అభినందించారు.

**ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన...** గ్రామంలో సాయిబాబా అందరం ఎదురుగా శ్రీకాళహస్తి చెందిన ఆషా నృత్య నాట్యాలయంకు చెందిన చిన్నారులు జస్మిత, సుదీక్ష, మంజుశ్రీ, ప్రత్యూష, చరిష్మా, చరణీ, హారిక తదితరుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం నాట్యాలయ నిర్వాహకులను సత్కరించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు నిర్వాహకులు పాల్గొన్నారు.

## తెలుగు భాషారక్షణకు చర్యలు తీసుకోవాలి

**పలమనేరు, మేజర్‌న్యూస్:** నూతన ప్రభుత్వం తెలుగు భాషారక్షణకు చర్యలు తీసుకోవాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసీనాదం నాయుడు కోరారు. ఆదివారం కళామందిరంలో తెలుగు భాష నూతన ప్రభుత్వం అనే అంశం మీద చర్చ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు అన్ని తెలుగులోనే ఇవ్వాలని తెలుగు మధ్యమంలో చదివిన వారికి ప్రభుత్వఉద్యోగాలలో ప్రాధాన్యత కల్పించాలన్నారు. ప్రముఖ



రచయిత జొన్నవిత్తుల శ్రీరామ చంద్రమూర్తి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

## బార్లలో మద్యం ప్రియుల దోపిడీ..!

(మొదటిపేజీ తరువాయి)

నిబంధనల మేరకు అమలు పరిచవలసిన రేట్లు పక్కన పెట్టి రాష్ట్రంలో ఏ జిల్లాలో ఏ బార్లలో లేని రేట్లతో మన జిల్లాలో అన్ని బార్లలో ఒక్కో క్వార్టర్ బాటిల్ పై 150 వరకు ఎక్కువ ధర వసూలు చేస్తున్నారు. అలాగే బార్లలో కోటర్ ఫుల్ బాటిల్ విక్రయించ రాదన్న నిబంధనలో కూడా ఉన్నాయి అయితే ఈ బార్ల యజమానులు కొంతమంది ఏకంగా బార్ల ముందు మద్యం షాపులు లాగా దుకాణాలను ఏర్పాటు చేసి అప్పనంగా రోజుకు లక్షలు విక్రయిస్తూ మద్యం బాబుల ధనాన్ని దర్జాగా దోచేస్తున్నారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. మందు విక్రయాలు ఓ భాగమైతే బార్లలో విక్రయిస్తున్న సైడ్ ఐటమ్స్ మందు కన్నా అధిక ధరలలో ఉంటుంది దాని ద్వారా కూడా నెలసరి కోట్ల రూపాయల్లో బార్ల యజమానులు లబ్ధి పొందుతున్నారని ఆరోపణలు కూడా వినిపిస్తోంది. సిట్టింగ్ నిబంధనలు కూడా అమలు చేయడం లేదు. బార్లలో టైమింగ్ కూడా సక్రమంగా పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. బార్లను రాత్రి 10గంటల 30 నిమిషాలకు మూసివేయాలన్న నిబంధనలు ఉన్న చిత్తూరు నగరంలో ఎక్కడగాని ఆ సమయాన్ని పాటించకుండా అర్ధరాత్రి రెండు గంటలయిన యదేచ్ఛంగా బార్లను కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. బార్ల యజమానులు, ఎక్సైజ్ శాఖ అధికారుల మధ్య లోపాయికారి ఒప్పందాల కారణంగా నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. బార్ల యజమానుల వద్ద నెలసరి మామూళ్లకు అలవాటు పడ్డ మద్యం శాఖలోని కొంతమంది అధికారుల కారణంగా మద్యం బాబుల జేబులకు చిల్లు పడుతుందన్న విషయాన్ని తెలిసిన వారు తమ జేబులు నింపుకుంటే చాలు అన్న భావనతో వారితో ఏకమై దర్జాగా దండుకుంటున్నారు. మద్యం షాపుల్లో కంటే బారుల్లో ధరలు షాక్ కలిగిస్తున్నాయి దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు కూడా భారీగా నష్టం వాటిల్లుతోంది. బార్లలో ప్రభుత్వ నిబంధనలను సక్రమంగా అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయంతో పాటు మద్యం ప్రియులకు అధిక ధరల భారం తప్పుతుంది. త్వరలో ప్రభుత్వం మద్యం దుకాణాల విషయంలో కొత్త పాలసీని అమలు చేయనుండటంతో బార్లపై నిఘాను పటిష్టం చేయాల్సి ఉంది.



## ప్రభుత్వ ఉద్యోగం పేరుతో రూ:6 లక్షలు శఠగోపం

(మొదటిపేజీ తరువాయి)

వద్ద 3 రూపాయలు వడ్డీకి 2020 సెప్టెంబర్ 1 వతేది మంగళవారం 6 లక్షలు రూపాయలు తీసుకొని 2020 సెప్టెంబర్ 2 వతేది బుధవారం ఉదయం 10 గంటలకు తిరుపతి పట్టణంలో ఉన్న గోవిందరాజులు స్వామి వారి ఆలయం వద్ద ఎస్.వెంకటేశ్వర్ రెడ్డి, (ఎస్‌వి రెడ్డి) ఆర్.రోహిత్‌లు చేతులు మీదగా 6లక్షలు రూపాయలు అక్షరాల ఇచ్చామని బాధితులు తెలిపారు. ప్రభుత్వం విద్యుత్ శాఖలో ఉద్యోగులు ఇప్పించాలని గత నాలుగేళ్లుగా చెప్పులు అరిగేలా వారి చుట్టు తిరిగినా ఒకరి మీద మరొకరు చెప్పుకొని తమని మానసికంగా వేధిస్తున్నారు అన్నారు. ప్రవేటు వడ్డీ వ్యాపారస్తులకు ప్రతి నెల 18వేలు రూపాయలు చొప్పున 46 నెలలు రూ.2లక్షల 30వేలు రూపాయలు వరకు బంగారు నగలు, పశువులు,మోటార్ బైక్‌లు సైతం అమ్మి వడ్డీ కట్టమన్నారు. అయితే తమగోడును అనేక సార్లు ఎస్.వెంకటేశ్వర్ రెడ్డి, రోహిత్‌లకు వినిపించిన ఈరోజు రేపు జాయినింగ్ రిపోర్టు వస్తోందని కాలంచెల్లిస్తూ మోసం చేస్తున్నారు తప్ప మాకు డబ్బులు కానీ, ఉద్యోగం ఇప్పించకుండా తపించుకొని తిరుగుతున్నారని ఆవేదన చెందారు. మేము నిరుపేద కుటుంబానికి చెందిన వారు ఎలాంటి సిరాస్థులు లేవని కూలీ జీవనంతో జీవిస్తున్నమన్నారు.అలాగే అప్పులు చెల్లించలేకుండా ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితి ఏర్పడిందని 2024 జులై 15వతేది తిరుపతి పట్టణం బైరాగ్ పట్టడి నందు ఎస్.వెంకటేశ్వర్ రెడ్డితో తమ సమస్యలు విన్నవించినా పట్టించుకోకుండా తమని కులంపేరుతో దూషించి అసభ్యకరంగా మాట్లాడి దౌర్జన్యం చేశాడని, అంతేకాకుండా నీకు దిక్కు ఉన్నచోట చెప్పుకో అన్నాడని జ్యోతి మేజర్‌న్యూస్‌తో కంటితడి పెట్టింది. గత నాలుగేళ్లుగా నెలకు 18 వేలు రూపాయలు కట్టలేక పూట గడవం గగనమైందని దీంతో కుటుంబ సమేతంగా ఆత్మహత్యలు చేసుకోవాలని అనిపిస్తుందని జ్యోతి ఆందోళన వ్యక్తం చేశారు. అందుచేత నేను ప్రభుత్వ ఉద్యోగం పేరుతో 6లక్షలు రూపాయలు తీసుకొని మోసం చేసిన ఎస్.వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్.రోహిత్‌లపై సమగ్రమైన విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని 2024 జులై 20 వతేది శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపోలీసు డీజీపీ వారికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవిన్స్ రిడ్రె స్సల్)లో ఫిర్యాదు చేసినట్లు భాదితరాలు ఎ.జ్యోతి తెలిపారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితురాలు ఎ.జ్యోతి

## ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో తాళం వేసిన ఇల్లు పదిలం

**చిత్తూరు క్రైం, మేజర్‌న్యూస్:** లాక్కుడ్ హౌస్ మానిటరింగ్ సిస్టం ద్వారా తాళం వేసిన ఇళ్లకు పోలీసు భద్రత కల్పించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లాలో పోలీసు వ్యవస్థ ప్రజల ఆస్తుల రక్షణ కొరకు సాంకేతిక సహాయంతో ఇంటి దొంగతనాలను కట్టడి చేయుటకు పలు విన్నూత్న విధానాలతో ముందుకు సాగుతున్నదని చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు సిసిఎస్ పోలీసుల వారి ద్వారా ప్రజలకు ఎల్లవేళలా అప్రమత్తం చేస్తూ ఇంటి దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలు వారి అవసరాల నిమిత్తం ఇంటికి తాళం వేసి ఇతర ప్రదేశాలకు వెళ్ళేటప్పుడు వారి ఇంటికి రక్షణగా ఎల్ హెచ్ ఎం ఎస్ పని చేస్తుందని, ఈ సాంకేతిక వ్యవస్థ తాళం వేసిన ఇళ్ళల్లో దొంగతనాలు జరగకుండా ఇళ్ళకు ఇంటి పెద్ద దిక్కుగా పహారా



కాస్తుంది. నిశ్చింతగా, నిర్భయంగా ఊళ్లకు వెళ్ళవచ్చు. సాంకేతికతను అందిపుచ్చుకున్న పోలీసు నిఘాలో తాళం వేసిన ఇండ్లు ఉంటాయి. అపరచితులు, కొత్తవ్యక్తులు ఆ ఇళ్ళల్లో ప్రవేశిస్తే వెంటనే పోలీసులకు సంకేతాలు వెళ్లి దొంగలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునే వీలుంటుంది. ఇందులో ప్రజలు ఒక్క రూపాయి ఖర్చు కూడా భరించాల్సిన అవసరం లేదు. చేయాల్సిందల్లా ఒక్కటే తమ స్మార్ట్ ఫోన్ ద్వారా లాక్డ్ హౌసెస్ మానిటరింగ్ యాప్ డౌన్లోడ్ చేసుకోవడమే ఇందులో రెండు దశలుంటాయి. ప్రజలు నివశిస్తున్న ఇంటినుంచే రిజిస్టర్ చేసుకోవడం. ఊళ్లకు వెళ్ళేటప్పుడు పోలీస్ వాచ్ కోసం సంక్షిప్త సమాచార రూపంలో రిక్వెస్ట్ పంపడం.స్మార్ట్ ఫోన్ ద్వారా గూగుల్ ప్లేస్టోర్ యాప్ తెరచి అందులో ఆంధ్రప్రదేశ్ పోలీస్ వారు అప్లోడ్ చేసిన లాక్డ్ హౌసెస్ మానిటరింగ్ సిస్టం యాప్‌ను ఎంచుకొని డౌన్లోడ్ చేసుకోవాలి. సదరు యాప్ నందు పేరు, ఫోన్ నెంబర్, లొకేషన్, తదితర వివరాలతో తమరు నివశిస్తున్న ఇంటి నుంచే రిజిస్టర్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ ప్రాసెస్ ముగియగానే తమరు రిజిస్టర్ చేసుకొన్న మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా ఏ పీ ఎల్ హెచ్ ఎం ఎస్ అనే రిజిస్ట్రేషన్ నెంబర్ వస్తుంది. ఈ రిజిస్ట్రేషన్ నెంబర్ ముఖ్యమైనది. ప్రజలు తమ ఇంటి రక్షణ కొరకు పోలీస్ వాచ్ రిక్వెస్ట్ పంపినప్పుడు ఈ రిజిస్ట్రేషన్ నెంబర్నే యూసర్ ఐడిగా పొందుపరచవలసి వస్తుందని, ఇళ్ళకు తాళం వేసి ఊళ్లకు వెళ్ళే సమయంలో ఈ రెండో దశ చాలా కీలకం. మీ స్మార్ట్ ఫోన్‌లో డౌన్లోడ్ చేసుకున్న లాక్డ్ హౌసెస్ మానిటరింగ్ సిస్టం యాప్ ఓపెన్ చేయాలి. రిక్వెస్ట్ పోలీస్ వాచ్‌లోకి వెళ్ళాలి. ఏ తేదిన సమయంలో ఇల్లు వదలి వెళ్తున్నారు, తిరిగి ఇంటికి వచ్చే తేది సమయం నమోదు చేయాలి. దీన్ని మెసేజి రూపంలో సెండ్ చేయాలి. ఆ తర్వాత సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి పోలీసు సిబ్బంది ఇంటికి వచ్చి ఆ ఇంట్లో కోరుకున్న ప్రాంతంలో వైఫై కెమెరా అమర్చుతారు. ఎవరైనా అపరిచితులు ఆ ఇంట్లోకి ప్రవేశిస్తే వెంటనే పోలీసు కంట్రోల్ రూంకు సంకేతాలు వెళతాయని, అక్కడ అలారం మోగుతుందని పోలీసు సిబ్బంది హుటాహుటిన ఆ ఇంటికి చేరుకుని రెడ్ హ్యాండెడ్‌గా దొంగలను పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. మరింత సమాచారం కొరకు చిత్తూరు జిల్లా పోలీస్ వాట్స్ యాప్ నెంబర్ 9440900005కు సంప్రదించ వలసిందిగా సూచించారు.

## ఎమ్మెల్యే థామస్‌కు అభినందనలు



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** చెన్నై పెర్టిలిటి సెంటర్ ఆసుపత్రి నూతన బ్రాంచ్ హైదరాబాదులోని మాదాపూర్ వద్ద ఆదివారం ప్రారంభించిన శుభసందర్భంగా గంగాధర నెల్లూరు శాసన సభ్యులు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.వి.ఎం.థామస్‌కు వెదురు కుప్పం క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ మురళి అభినందనలు తెలిపారు. హైదరాబాదులో నూతనంగా బ్రాంచ్ ప్రారంభోత్స వంలో ఆయన పాల్గొని ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలియజేశారు.

## పచ్చికాపలంలో వైభవంగా బండి కుంభాలు

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలోని పచ్చికాపలం మహాభారతం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బండి కుంభాలు కార్య క్రమం అత్యంత వైభవం గా జరిగింది. భీముడు బకాసురునికి బండి కుంభంతో వచ్చిన కార్య క్రమం పలువురుని ఆకట్టుకుంది. పలు గ్రామాల నుంచి బండి కుంభాలు తీసుకుని వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కుంభాలు వేసి అమ్మ వారికి నైవేద్యం పెట్టారు. కార్యనిర్వాకులు భక్తులకు బండి కుంభాల ప్రసాదాన్ని అందించారు. బండి కుంభాలు కార్యక్రమాన్ని తిలకించడానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



## సీనియర్ పోరాటయోధునికి సన్మానం

**గంగవరం, మేజర్‌న్యూస్:** గంగవరం మండలం కీలపట్ల గ్రామానికి చెందిన సీనియర్ దళిత పోరాటయోధుడు సి.బోయ కొండయ్యను జాతీయ మానవ హక్కులు మరి అవినీతి నిర్మూలన సంస్థ పలమనేర్ పట్టణ కార్యా లయం నందు పాతకీలపట్ల కె. మురళి అధ్యక్షతన ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా నాయకులు డివి మునిరత్నం, వేలాయుధం మాట్లాడుతూ బోయ కొండయ్య ఎన్నో సంవత్సరాల నుండి ఎస్సీ ఎస్టీ ,బీసీ, మైనార్టీల సమస్యల పరిష్కారానికి ఎన్నో ఉద్యమాలు చేపట్టారని కొనియాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలను తన పాట ద్వారా కవితలు ద్వారా ఎంతో మందిని చైతన్యవంతం చేసి పోరాటాల వైపు ఆకర్షింప చేశారని గుర్తు చేశారు. నేటి నుండి నాటి వరకు బోయ కొండయ్య నిస్వార్థముతో ప్రజల కొరకు పనిచేసి చరిత్ర సృష్టించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను దృష్టిలో పెట్టుకొని పట్టణ, గ్రామీణ, బడుగు, బలహీన, మైనార్టీ ప్రజలకు ఉపయోగపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్థసారథి, సుబ్రహ్మణ్యం, రవికుమార్, పాండురంగాచారి, సాంబశివ, సరస్వతి, శివన్న తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శైలేంద్ర కుమార్ పుట్టినరోజు వేడుకలు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** బీసీల అభ్యున్నత కోసం నిరంతరం కృషి చేస్తున్న ఈతమాకుల శైలేంద్ర కుమార్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పెద్దకాపు వీధిలో జరిగిన వేడుకలలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు హాజరై పుష్పగుచ్చాలు అందించి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ పులిగూరు మురళీకృష్ణ రెడ్డి శైలేంద్ర కుమార్‌ను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బీసీల కోసం నిరంతరం పోరాడుతున్న శైలేంద్ర కుమార్ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సేవా గుణం కలిగిన ఈతమాకుల శైలేంద్ర కుమార్ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని, తద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలవాలని శ్రీవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో తాతయ్య గుంట గంగమ్మ ఆలయ మాజీ పాలకమండలి సభ్యులు గంజి సుధాకర్ రెడ్డి, ఓటేరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మోహన్, మహేష్ పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఉచిత కంటి వైద్య శిబిరం

**గూడూరు, మేజర్‌న్యూస్:** ప్రగతి సేవా సంస్థ, సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుశీల నేత్రాలయ, డాక్టర్ సుధాకర్ రావు పర్యవేక్షణలో "ఉచిత మెగా కంటి వైద్య శిబిరం" నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ప్రగతి సేవ సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ ఉచిత మెగా వైద్య కంటి శిబిరం నందు గూడూరు పట్టణ, పరిసర ప్రాంతాల నుండి 110 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆపరేషన్ అవసరమైన వారిని నెల్లూరుకి తరలించి ఉచిత కంటి ఆపరేషన్ చేయించి తిరిగి వారిని వారి గమ్యస్థానానికి చేరుస్తా మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యక్షులు బండి ధనంజయ రెడ్డి, కార్యదర్శి జి.చంద్రశేఖర్, సుశీల నేత్రాలయ కంటి వైద్య నిపుణులు, సిబ్బంది, పిఆర్ఓ నాగార్జున, ప్రగతి సేవా సంస్థ, కార్యవర్గ సభ్యులు పీడీ కరీముల్లా, నక్కా రామకృష్ణ, రిటైర్డ్ ఎస్సై ప్రభాకర్, కోట వెంకటేశ్వర్లు, ఆక్వా రమేష్, పోతిరెడ్డి పెంచలయ్య, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, వాకాటి శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## సంచార జాతుల అభివృద్ధికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి

**సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాసరావు డిమాండ్**



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:**

ఆంధ్రప్రదేశ్ సంచార జాతుల అభివృద్ధి మండలి చిత్తూరు జిల్లా కార్యవర్గ సభ్యులు సమావేశం చిత్తూరు నగరంలోని స్థానిక ఓపనపల్లి నందు చిత్తూరు జిల్లా సెక్రటరీ తోట రాజా నివాస ఆవరణలో నిర్వహించడం జరిగింది, ఈ సమావేశానికి ముఖ్యఅతిథిలుగా రాష్ట్ర అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాసరావు విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ సంచారజాతుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని, అన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటారి రవీంద్ర, రాష్ట్ర కోశాధికారి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు గోవింద్ సంపంగి, రాష్ట్ర జిల్లా మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## గజేంద్ర కార్యాలయానికి జనసేన నాయకురాలు

**పలమనేరు, మేజర్‌న్యూస్:** గుడియాత్తం రోడ్‌లో ఉన్న కార్యాలయాన్ని ఆదివారం గంగవరం మండలంలోని పోలీస్ స్టేషన్ పక్కన మార్చబడినది అని డాక్టర్ ఆకుల గజేంద్రప్రసాద్ విలేకరుల సమా వేశంలో తెలిపారు. ఆయన కార్యాలయానికి జనసేన పార్టీ నాయకు రాలు చైతన్య ఆది కేశవులు పూజా కార్యక్రమానికి హాజరైనారు. డాక్టర్ ఆకుల గజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆది కేశవులు నాయుడు చైతన్య కార్యాలయానికి రావడం చాలా సంతోషదగ్గ విషయమని కొనియాడారు. అనంతరం నూతన లైన్స్‌క్లబ్ అధ్యక్షులు కె.ఆర్ జయశంకర్ ఐ క్యాంప్ ఏర్పాటు చేయుటకు మీ సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. అనంతరం పవన్ కళ్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ జనసేన పార్టీ నాయకులు తెలిపారు. చైతన్యక్క నాయకత్వం వర్ధిల్లాలినినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు కె.ఆర్ జయశంకర్, పూల చైతన్య, బాలాజీ, వేణు, పగడాల ప్రవీణ్, కిషోర్ కుమార్, దిలీప్ పాల్గొన్నారు.



## ప్రజలు ఉచిత వైద్య శిబిరాలు ఉపయోగించుకోవాలి

**తెలుగుదేశం మహిళా నేత బొజ్జల బృందమ్మ**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** పట్టణంలో ఆదివారం అవధూత మాసపత్రిక తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా టాటా. స్వీకార్ క్యాన్సర్ హాస్పిటల్. రష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ల బృందంచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరంనకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి కీర్తిశేషులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి అయినటువంటి బొజ్జల బృందమ్మ పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో బృందమ్మ మాట్లాడుతూ ప్రతి మనిషికి జీవితంలో ఆరోగ్యమే చాలా ముఖ్యమైనదని అందులో క్యాన్సర్ వ్యాధి సోకకుండా జాగ్రత్త పడాలని తరచూ జరిగే ఇటువంటి ఉచ్చిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించుకుని ప్రాథమిక దశలోనే వ్యాధి సోకి ఉన్న ఎడల వ్యాధి ప్రబలకుండా డాక్టర్లచే తగు సూచ నలు, సలహాలు తీసుకోవచ్చాన్నారు. గతంలో కూడా మా భర్త జయంతి రోజున మెడికల్ క్యాంపులు నిర్వహించామని రేపు జరగబోవు రోజులలో టాటా స్వీకార్ క్యాన్సర్ బృందం వారిచే ఉచ్చిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. అనంతరం మొగలి రేకులు సీరియల్ నిర్మాత పల్లమాల సుధాకర్ మాట్లాడుతూ ఈ రోజున ఒక మంచి కార్యక్రమాన్ని అవధూత మాసపత్రిక ఎడిటర్ అక్కుర్తి ఆనంద్ రెడ్డి ప్రతి ఏడాది ఇలాంటి మెగా మెడికల్ క్యాంపును నిర్వహించడం ఎంతో ఆనంద దాయకంగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిమల్లం చైర్మన్ గిరి నాయుడు, పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు, కన్నావరం హరిబాబు, ముచ్చెలి సురేంద్రబాబు, రమణారెడ్డి, పోతుల రాజకుమార్, వాకచర్ల గుర్రప్ప శెట్టి, జూలగంటి మురళి, డివి నారాయణ, భక్తవత్సలం రెడ్డి, జిలాని భాష, సిద్దులు ప్రసాద్, మహిళా నాయకురాలు మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.






# మీ సహకారం మరువలేనిది..

## - బాధ్యతతో ప్రజలకు సేవలు అందించాలి : కమిషనర్ అదితి సింగ్

**తిరుపతి బ్యూరో మేజర్‌న్యూస్ :** ఉద్యోగాన్ని ఒక బాధ్యతగా భావించి, ప్రజలకు సేవలు అందించాలని, విధుల్లో మీరందరూ అందించిన సహకారం మరువలేనిదని నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ అన్నారు. కడప జాయింట్ కలెక్టర్‌గా పదోన్నతిపై వెళుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్‌కు సమావేశ మందిరంలో ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అదితి సింగ్ మాట్లాడుతూ ఉద్యోగులు అందరూ తమ విధులను బాధ్యతతో నిర్వహించాలని అన్నారు. ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది అంతా తనకు ఎంతో సహకరించారని అన్నారు. తాను వచ్చి కొద్ది కాలమే ఇక్కడ పనిచేసినా ప్రతి ఒక్కరూ తనకు బాగా సహకరించారని మీ సహకారం మరువలేనిది అన్నారు. తాను పదోన్నతిపై వెళ్ళినా, ఎక్కడ విధులు నిర్వహించినా ఇక్కడ పనిచేసిన కాలం జీవితంలో గుర్తుండి పోతుందన్నారు. అన్ని విభాగాల అధికారులు తమ స్థాయికి మించి సహకరించారని అన్నారు. రానున్న అధికారులను కూడా ఇదే విధంగా సహకరించి, సంస్థ పురోభివృద్ధి పనిచేయాలని అన్నారు. ఎన్నికల వేళ మా అందరినీ ఒక తాటిపై తీసుకువచ్చి ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు మీరు చేసిన కృషి గొప్పదని నగరపాలక సంస్థ అధికారులు కమిషనర్ ను కొనియాడారు. మీ వద్ద నుండి ఓపిగ్గా పనిచేసే విధానాన్ని మేమందరూ నేర్చుకున్నమని పలువురు అధికారులు అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డెప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, స్మార్ట్ సిటి జి.ఎం. చంద్రమౌళి, ఆర్‌ఓలు సేతుమాధవ్, కే.ఎల్.వర్మ, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ రెడ్డి, సెక్రటరీ రాధిక, డిసిపి శ్రీనివాసులు, మేనేజర్ చిట్టిబాబు, డిఈలు, శానిటరీ సూపర్ వైసర్లు, పాల్గొన్నారు.

# రాష్ట్ర హోం మంత్రిని కలిసిన టీడీపీ మహిళా నాయకురాలు పనబాక భూలక్ష్మి

**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ను రాష్ట్ర సచివాలయంలో నెల్లూరు పార్లమెంటు టిడిపి మహిళా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. హోం శాఖామంత్రి వంగలపూడి అనితకు పనబాక భూలక్ష్మి శాలువా కప్పి,సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పనబాక భూలక్ష్మి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు ప్రతిపక్ష పార్టీలో ఆంధ్ర రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అనేక పోరాటాలు చేసి,మహిళలకు, ఆడబిడ్డలకు అండగా నిలబడి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆమె కష్టాన్ని గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హోంశాఖ మంత్రిగా వంగలపూడి అనితను నియమించడం హర్షనీయమన్నారు. వారి వెంట టిడిపి లీగల్ సెల్ న్యాయవాది పనబాక గంగరాజు, టిడిపి నాయకులు పనబాక గంగాధరయ్య, పనబాక గంగబాబు, రాయపు హరి, రవి ఉన్నారు.



# కాంగ్రెస్ వరాలు అమలుతో ఏపీ సుభిక్షం

## - విభజన హామీలు అడిగే ధైర్యం టీడీపీకి ఉందా.?
## - కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ తులసి రెడ్డి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర విభజన సమయంలో నవ్యాంధ్రప్రదేశ్ కు అన్ని ప్రాంతాలు సమన్యాయంతో అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ సీమాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, ఏర్పాటు ద్వారా ఆంధ్రప్రదేశ్ భిక్షంగా ఉండేదని కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ తులసి రెడ్డి అన్నారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా దారు. విభజన సమయంలో నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను కూడా అడిగే ధైర్యం లేని పార్టీ పాలన రాష్ట్రంలో కొనసాగిస్తున్నారన్నారు. 2014 తర్వాత నవ్యాంధ్రకు ముఖ్యమంత్రి చంద్రబాబు, అలాగే 2019లో జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక హోదా అంశం గాని, విభజన హామీల అమలుకు కేంద్రంపై చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేయలేదన్నారు. కేంద్రంలో 2014, 2019లో బిజెపికి పూర్తి మెజారిటీ ఉండేదని, కానీ 2024లో ఆ పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు సరైన సమయమని కేంద్రంపై ఒత్తిడి తెస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి




జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం కన్నా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పిందని, ఏదో ఒక హింసాత్మక ఘటన ప్రతిరోజు జరుగుతూనే ఉండడం కలవరపాటుకు గురిచేస్తుందన్నారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే జగన్మోహన్ రెడ్డికి పట్టిన గతి కూటమి ప్రభుత్వానికి ఐదు నెలల్లో పడుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపి ఎన్ని ప్రతి దాడులు చేసుకుంటున్న బిజెపితో మాత్రం అంటగాగి ఉంటారని స్పష్టం చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రయోజనాలపై చంద్రబాబు దృష్టి సారించకపోతే ఇబ్బందులు ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ప్రమీలమ్మ, మాంగాటి గోపాల్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, పార్థసారథి రెడ్డి, చిట్టి బాబు, సోమశేఖర్ రెడ్డి, శివ శంకర్, నన్నే ఖాన్, నరేంద్రబాబు, గోపిగౌడ్ పాల్గొన్నారు.

# బోయకొండ దేవస్థానంలో ఘనంగా చండీహోమం

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ దేవస్థానం నందు పౌర్ణమి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు భక్తి శ్రద్ధలతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కార్యనిర్వాహణాధికారి ఏకాంబరం ఆధ్వర్యం లో జరిగింది,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు చండీహోమం మహిమ ను వివరిస్తూ...చండీహోమం కేవలం ఒక వర్గం కో ఒక వర్గం కో మాత్రమే కాదు.. అన్ని వర్ణాల వారికి సంబంధించినది. లక్ష్మీ, సరస్వతీ, కాళికాదేవి..ఈ ముగ్గురు శక్తుల కలయికతో ఏర్పడినదే మహాచండీ.. ఈమె హోమం చేయడంవల్ల సమస్త బాధలు నివారణమవుతాయి.వ్యాపారాలు వృద్ధి చెందుతాయి, శత్రువులు నశిస్తారని, పరప్రయోగాలతో బాధపడేవారు, తరచుగా కుటుంబంలో మరణాలు సంభవిస్తున్నవారు, అకారణంగా కోర్టు కేసులలో ఇరుక్కుంటున్నవారు, ఇంకేమైనా ఇతరత్రా సమస్యలతో బాధపడతున్నవారు చండీహోమాన్ని చేయించుకోవడం వల్ల చండీమాత అనుగ్రహంతో త్వరితగతిని, వాటి నుండి బయటపడతారని.లోక రక్షకులైన అమ్మవారి స్వరూపాల్లో చండీ ఒకటి.



లోక కల్యాణం కోసం, విశేష కార్యసిద్ధి కోసం, సకల చరాచర జగత్తు సృష్టికి, స్థితికి, లయకు మూల కారణమైన జగన్మాతను ఆరాధించడం అనాదిగా వస్తోందని. ఆదితత్వాన్ని నేత్రమూర్తిగా భావించి చేసే ప్రకృతి ఉపాసనే శ్రీవిద్య. అది లలితా పారాయణం, చండీ పారాయణం ..అని రెండు రకాలు. బ్రహ్మాండ పురాణం, దేవీ భాగవతం, లలితాదేవి మహిమలను చెబితే, మార్కండేయ పురాణం చండీ మహత్యాన్ని వివరిస్తుందని అర్చకులు భక్తులకు తెలియజేశారు.

# నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

## - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** నేడు చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంను ఉ.10 గం.ల నుండి మ.1 గం.వరకు కలెక్టరేట్ లోని నూతన సమావేశపు మందిరం నందు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.





# శ్రీ శక్తి పీఠంలో ఘనంగా గురు పౌర్ణమి పూజలు

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** మండలంలోని రాయల చెరువు కట్ట సమీపంలో గల శ్రీ శక్తి పీఠం లో గురు పౌర్ణమి సందర్భంగా పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు ఇందులో భాగంగానే ఆదివారం గురు పౌర్ణమి పురస్కరించుకొని గురు పరంపరకు చెందిన విశ్వ గురువు శ్రీకృష్ణ భగవాన్, వ్యాస భగవాన్, జగద్గురు ఆదిశంకరాచార్యులు, వాల్మీకి మహర్షి ,కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి ,స్థానిక పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని చిత్రపటాలకు విశేష పూజా కార్యక్రమాలు జరిపారు. బియ్యంతో తయారుచేసిన అన్నాన్ని శ్రీ మరకత శక్తి కాళీ దేవి అమ్మవారికి అన్న కూటో ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం లోక కళ్యాణార్థం కోసం 108 సుగంధ ద్రవ్యాలతో చండీ హోమాన్ని చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు అమ్మవారి దర్శనం, తీర్థప్రసాదాలతో పాటు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.


కుప్పంలో..




శ్రీకాళహస్తిలో ...


బాలాయపల్లిలో...

**కుప్పం, మేజర్‌న్యూస్:** సాయి మాతా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కుప్పం పట్టణంలోని ఏం.ఎఫ్.సి.జూనియర్ కళాశాల దగ్గర ఉన్న ద్వారకామాయి సాయిబాబా దేవాలయం లో గురు పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చనలు ఘనంగా నిర్వహించి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంచారు. సాయిబాబా సూచించిన శ్రద్ధ, ఓపిక లను భక్తులు కీర్తన రూపంలో భజనలు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, భార్గవ్, లిఖిత్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకాళహస్తిలో గురు పౌర్ణమి వేడుకలు**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** పట్టణంలోని మద్రాస్ రోడ్డు రోడ్డులో సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా బాబా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది సాయినాథునికి కాగడా హారతితో ప్రారంభమై 108 అష్టోత్తర శతకలత సాయిబాబా ఆలయాలను విద్యుత్ దీపాలంకరణలు, వివిధ రకాల పుష్పాలతో భక్తులను ఆకట్టుకునేలా సర్వాంగ సుందరంగా అలంకరిం చారు. వేకువజాము నుంచే బాబాకు అభిషేకాలు, అర్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి నామస్మరణలు, భజనలతో ఆలయాలు మార్మోగాయి. బాబా దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయాలు కిటకిట లాడాయి. బాబాకు పాలాభిషేకాలు నిర్వహించగా, దర్శనానంతరం తీర్థ, ప్రసాదాలను భక్తులకు అందజేశారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమా లను నిర్వహించారు.

**మంగళంలో గురు పౌర్ణమి వేడుకలు...**

**మంగళం మేజర్‌న్యూస్:** తిరుపతి మంగళం పరిధిలో ఉన్న సాయిబాబా ఆలయంలో ఆదివారం ఆలయ నిర్మాణ కమిటీ, స్థానికులు పెద్ద ఎత్తున గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. సాయిబాబా ఆలయంలో పెద్ద ఎత్తున తదితరులు పాల్గొన్నారు.

**చౌడేపల్లిలో...**

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** పట్టణంలోని బజారు వీధిలో వెలసి ఉన్న శ్రీ షిరిడిసాయి మందిరములో గురుపౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవముగా జరిగాయి.ఆదివారము ఉదయం ఏడుగంటలకు నుండి తొమ్మిది గంటల వరకు మూల విరాట్ కు పాలాభిషేకం,మద్యాహ్నం రెండు గంటలకు పురవీధులలో స్వామివారి ఊరేగింపు జరిగినది,ఈ కార్యక్రమానికి శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానం మాజీ చైర్మన్లు శ్రీమతి రతీదేవి,యస్.కే .వెంకటరమణా రెడ్డి వారి కుటుంబ సభ్యులు ప్రతి ఏడు గురుపౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం, ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ళు,ఆలయ ప్రాంగణంలో పూల అలంకరణ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుండి స్వామివారికి పాలాభిషేకం చేయడానికి బారులు తీరారు.ఆలయ ప్రాంగణం సాయి నామస్మరణతో మార్మోగింది.

# వైభవంగా గురుపూర్ణమి వేడుకలు

అభిషేకములు, హారతిను నిర్వహించి. అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామిని సర్వంగా సందర్భంగా ముస్తాబు భక్తుల దర్శన భాగ్యం కలిగించగా ఆలయ అర్చకుల మంత్రోశ్చరణల మధ్య వేలాది మంది భక్తులు తరలి వచ్చి బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శశిధర్. ఆలయ కమిటీ సభ్యులు జగదీష్ మాట్లాడుతూ భక్తులు ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున గురుపౌర్ణమి జరుపుకుంటారని. ఆలయ కమిటీ తరఫున నేడు గురుపౌర్ణమి పురస్కరించుకొని, ఈ ఆలయంలో స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించి స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించామని, తెల్లవారుజాం నుంచే భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులవుతున్నారని తెలియజేశారు.

**కార్వేటినగరంలో...**

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలంలోని ఆర్కే విబి పేట గ్రామంలో వెలసియుండు ఆరిమాను గంగమ్మకు పౌర్ణమి సందర్భంగా శాఖంబరి అలంకరణలో పూజ చేయడం జరిగింది. దీనికి గ్రామస్తులు సహాయంతో అంగరంగ వైభవంగా పూజలు నిర్వహిం చారు. ఉభయ దాతలుగా మోహన్ రెడ్డి, లతా కుటుంబ సభ్యులచే పూజా కార్యక్రమం జరిగినది ఆచార్య శివశర్మ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా పూజలు నిర్వహించడం జరిగింది. అలాగే డీఎం పురం పంచాయతీలో వెలసిన శ్రీశ్రీశ్రీ నైనేరమ్మ దేవస్థానం డేరా కండ్రిగలో గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ నైనేరమ్మ దేవస్థానం నందు పాలాభిషేకం, విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. పుత్తూరు వాస్తవ్యులు పొదలకూరు బాలసుబ్రమణ్యం గీతా దేవి పూజా కార్యక్రమంలో పాల్గొని దేవస్థానానికి రూ.10వేలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బుర్రా ఆనంద్, గీతా, ముని సోమ సుందర పిళ్ళై మరియు గ్రామ పెద్దలు సుబ్రహ్మణ్యం వెంకటయ్య బొబ్బిలిచ,, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**చిట్టమూరులో...**

**చిట్టమూరు మేజర్‌న్యూస్:** మండలంలోని మల్లాం, చిట్టమూరు,ఎల్లసిరి సాయిబాబా ఆలయాలలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు పోటెత్తారు. అనంతరం టిడిపి మహిళా నాయకురాలు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**నాయుడుపేటలో గురుపౌర్ణమి వేడుకలు...**

**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** పట్టణంలోని అగ్రహారపేటలో వెలిసి ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటల నుండి శ్రీ సాయిబాబా వారి మేలుకొలుపు, కాకడ హారతి, పాలాభిషేకం, శ్రీ సాయి సహస్రనామ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు గురు పూర్ణిమ ఉత్సవంలో పాల్గొని శ్రీ సాయినాథుని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి ప్రభాకర్ నాయుడు, కార్యదర్శి సిహెచ్ శ్రీధర్ కుమార్, కోశాధికారి పూనాటి తిరుమల నాయుడు, కమిటీ సభ్యులు ఎం.ముత్యాల రెడ్డి, టి.జయచంద్రారెడ్డి, ఇ. సిద్ధార్థ, ఎం.చంద్రశేఖర్


నాయుడుపేటలో...

**జయంపులో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు**

**బాలాయపల్లి మేజర్ న్యూస్ :** గురు పౌర్ణమి వేడుకలు వెంకటగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. బాలాయపల్లి మండలం పరిధిలోని జయంపు సాయిబాబా ఆలయంలో వెందోటి.సుబ్బరామిరెడ్డి నేతృత్వంలో జరిగిన వేడుకల్లో వెందోటి.మనోహర్ రెడ్డి మరియు వెందోటి కార్తీక్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురు పౌర్ణమి పర్వదినానికి ఒక ప్రత్యేకత ఉందన్నారు. ఇది ప్రతి ఒక్కరూ గురువులకు కృతజ్ఞత చెప్పుకునేందుకు జరుపుకునే పండుగ అని కొనియాడారు. సనాతన హైందవ ధర్మంలో తల్లి, తండ్రి తర్వాత స్థానం గురువుకే దక్కిందన్నారు. పైగా ఈ సృష్టిలో మనిషి పుట్టినప్పటి నుంచి మరణించేదాకా ప్రతిక్షణం ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్చుకుంటూనే ఉంటాడని, అందులో కొంత తల్లిదండ్రుల వద్ద నేర్చుకుంటే మిగిలినదంత గురువు దగ్గరే నేర్చుకుంటాడు అని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**శాంతిపురంలో...** 21సీటీఆర్38

**శాంతిపురం, మేజర్ న్యూస్:** స్థానిక పరమహంస యోగానంద విద్యాలయ నందు గురు పూర్ణిమ వేడుకలు ఎంతో అద్భుతంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నపిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమము మరియు పెద్ద పిల్లలకు పాదపూజ కార్యక్రమము ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహింప జేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాలయ ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్, గురూజీ భక్తులు నారాయణ శెట్టి,చంద్రశేఖర్,గణపతి శాస్త్రి, కోదండప్ప మరియు ప్రధాన పురోహితులు వెంకట సుబ్బయ్య పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యార్థులకు గురువుల యొక్క ప్రాధాన్యతను ఎంతో చక్కగా వివరించారు ఈ కార్యక్రమంలో అనేకమంది తల్లిదండ్రులు, విద్యార్థులు మరియు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చిట్టమూరులో...


మంగళంలో...


శాంతిపురంలో...


చౌడేపల్లిలో ...

## వైభవంగా అగ్నిగుండం



**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని నెలబల్లి పంచాయతీ అక్కగారిపేట గ్రామం నందు 6 వ అనంద అగ్నిగుండ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రుక్మిణి సమేత పాండురంగస్వామి వారి అనంద అగ్నిగుండ మహోత్సవ వేడుకల్లో భాగంగా మొదటి రోజు భక్తులు అందరూ ప్రారంబోత్సవ పూజ నిర్వహించారు. మరుసటి రోజున శనివారం ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం అగ్నిగుండం త్రవ్వి అగ్నిగుండం వెలిగించారు. భజన గురువు తైదులపాటి సీతారామయ్య దాస్ అగ్నిగుండంలో ప్రవేశించే వారికి కంకణం దారణ చేపట్టారు. పాండురంగస్వామి వారికి కలిశ పూజ ప్రారంభించి భజనలు ఆరంభం చేశారు. అక్కడ వేసిన భజనలలలో భాగంగా కోలాటము, పండరి భజన, జెండా వరుస, కృష్ణ లీలలు, పాండురంగస్వామి దండకం ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి. నరసింహ స్వామి దండకం ముగిసిన అనంతరం భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.

## జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం



**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** మండలంలోని ఆలత్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న టీ టీ కండి గ్రామంలో జనసేన సభ్యత్వ నమోదు మహా యజ్ఞం కార్యక్రమాన్ని గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం జనసేన పార్టీ నియోజకవర్గ బాధ్యులు యుగంధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాల్లో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మహా యజ్ఞంలా నిర్వహించారని సూచనల ప్రతి గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు ఈ కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దుస్తులు, విద్యా సమాగ్రి పంపిణీ



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం చిందేపల్లి ఎస్టీ కాలనీ పిల్లలకు దాతలు సహాయంతో విద్యాసమాగ్రి, ఒక జత బట్టలు పంపిణీ చేసినట్లు యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మధురాంతకం మునిశేఖర్ ట్రస్ట్ అధ్యక్షులు వినోద్‌లు తెలిపారు. ఈ సందర్భంగా మునిశేఖర్, వినోద్‌లు మాట్లాడుతూ గిరిజన పిల్లలు బాగా చదువుకుంటేనే ఎస్టీ కాలనీలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. గిరిజన పిల్లలు బడులకు ప్రతిరోజూ హాజరయ్యేవిధంగా గిరిజన కాలనీలో ఉన్న పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు ఇకనైనా మారి పిల్లలలో మార్పు తీసుకురావాలని కోరారు. గిరిజనుల అభివృద్ధికి యువనేస్తం అసోసియేషన్ దాతల సహాయంతో కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ మండల కో ఆర్డినేటర్ అరుణ, వాలంట్రీలు మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్లు కల్వర్టులను ఏర్పాటు చేయాలి



**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** చిత్తూరు నగరం లోని సంతపేట 46వ డివిజన్ కు చెందిన విజయలక్ష్మి కాలనీ ఐదవ క్లాస్‌లో చిన్నపాటి వర్షానికి రోడ్లు చెరువులను తలపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ముత్యాల శెట్టి మీడియాతో మాట్లాడుతూ ఇటీవల నిరంతరాయంగా కురుస్తున్న వర్షానికి మురికి కాలువలు నుండి దుర్గంధపు దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ఈ కారణంగా దోమల బెడద ఎక్కువైంది అన్నారు. సిసి రోడ్లు కల్వర్టులు లేకపోవడంతో వాహనాల రాకపోకలు కూడా ఇబ్బందిగా ఉందన్నారు. నగర పాలక సంస్థ అధికారులు చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే స్పందించి సీసీ రోడ్డు కల్వర్టు నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని పారిశుద్ధ్య పనులు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## ఆలయంలో అన్నదానం

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరంలో వెలసిన ద్రౌపతి సమేత ధర్మరాజు ల ఆలయంలో రాజా కుమార్ స్వామి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో2003 సంవత్సరం పదో తరగతి చదువుతున్న పూర్వ విద్యార్థులు ఆలయ వద్ద దాదాపు 1000 మంది పైగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వం విద్యార్థులు మాట్లాడుతూ ప్రతి ఏడాది అన్న దాన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యార్థులు వికాసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవాలి

### - ఇన్ఫోసిస్ డైరెక్టర్ గోపాలకృష్ణన్




**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు ఐఐటి కాన్విగేషన్ ప్రపంచం టెక్నికల్ ప్రతిభవంతుల కోసం ఎదురుచూస్తుందని భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రతిభవంతులకు అత్యధిక అవకాశాలు ఉన్నాయని టెక్నికల్ విద్యార్థులు ఈ అవకాశాలు అందుపుచ్చుకోవాలని కో ఫౌండర్ ఆఫ్ ఇన్ఫోసిస్ చైర్మన్ ఎక్సెలర్ వెంచర్స్ క్రిష్ గోపాల్ కృష్ణన్ పిలుపునిచ్చారు. తిరుపతి ఐఐటి కళాశాల ఆరవ కన్విగేషన్ ఘనంగా నిర్వహించారు. ఏర్పేడు తిరుపతి ఐఐటి కళాశాల ఆరవ కాన్వకేషన్ సెర్మనీ ఘనంగా నిర్వహించారు. తిరుపతి ఐఐటి డైరెక్టర్ కే ఎన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కన్విగేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్ఫోసిస్ వైస్ చైర్మన్ క్రిష్ గోపాల్ కృష్ణన్, అతిథిగా జెఎస్డబ్ల్యు గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ విచ్చేశారు. మాస్టర్ డిగ్రీస్, ప్రత్యేక డిగ్రీ, డిప్లమా డిగ్రీ సాధించిన 338 మంది విద్యార్థులు పట్టాలు పొందారు. విద్యార్థులకు పట్టాలను ప్రధానం చేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు మాస్టర్ డిగ్రీ పట్టాలను అతిధులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఐఐటి డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ గత ఆరేళ్లలో తిరుపతి ఐఐటి సాధించిన ప్రగతిని వివరించారు. అనుకున్న లక్ష్యాలలో మేరకు ఐఐటి కళాశాల మెరుగైన వసతులతో ప్రగతి పథంలో సాగుతుందని, తమ విద్యార్థులు అపూర్వమైన విజయాలను వివిధ ప్రాజెక్టులో సాధిస్తున్నారని వివరించారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిధి జెఎస్డబ్ల్యు గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ ప్రసంగిస్తూ నూతనంగా ప్రారంభమైన తిరుపతి ఐఐటి పూర్వం నుంచి ఉన్న ఐఐటి కళాశాలలకు తీవ్రమైన పోటీ ఇస్తుందని ప్రశంసించారు. భారత్ ప్రభుత్వం విజన్ 2047 వికసిత్ భారత్ లక్ష్యాలను అందుకోవడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. ముఖ్యఅతిథి క్రిష్ గోపాల్ కృష్ణన్ ప్రసంగిస్తూ ప్రపంచం ఐదు అంశాలకు సంబంధించి ఎదురు చూస్తుందని ప్రతిభావంతులైన టెక్నికల్ విద్యార్థులు మీదనే ప్రపంచ భవిష్యత్తు ఆధారపడి ఉందని అన్నారు. రాబోయే భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై ఎక్కువగా ఆధారపడుతుందని భవిష్యత్తు టెక్నికల్ విద్యార్థులకే డిమాండ్ ఉందని ఈ అవకాశాల్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు పలువురు మాట్లాడుతూ తిరుపతి ఐఐటీలో తాము డిగ్రీలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఐఐటి అధ్యాపకులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్య, ఆరోగ్యంపై దృష్టి సారించండి

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్ :** ప్రస్తుత వర్షాకాలంలో ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రెడ్డెప్ప అన్నారు. మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ రెడ్డెప్ప ఆధ్వర్యంలో మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను సమావేశంలో వివరించారు. మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన జూనియర్ కాలేజీలో విద్యార్థులు చేర్చేందుకు ప్రజా ప్రతినిధులు పదవ తరగతి పూర్తయిన విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యపరిచి జూనియర్ కాలేజీలో చేర్పించాలని ఎంపీపీ కోరారు. మధ్యాహ్న భోజనం పథకంలో శుభ్రత తో పాటు నాణ్యత పాటించడం లేదని దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు బ్యానర్లు అంటించి కార్యాలయయాలు కనబడకుండా తెదేపా నాయకులు చేశారని వాటిని తొలగించాలని వైస్ ఎంపీపీ బాబు ఎంపీడీవో అబ్దుల్ రహీంను కోరారు. ఎంపీడీవో మాట్లాడుతూ పెన్షన్లను ఇప్పటికే వస్తున్న ప్రతి ఒక్కరికీ అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించినట్లు, కొళత్తూరు పంచాయతీలో జిల్లా అధికారుల ఆదేశంతో ఇద్దరికీ డప్పు కళాకారులకు పెన్షన్లు పంపిణీ చేయలేదన్నారు. వీరప్పల్లి ఎంపిటిసి సుబ్రహ్మణ్యం గతంలో వలంటీర్లు కొంతమంది నాయకుల ప్రోద్బలంతో హౌస్ హోల్డ్ మ్యాపింగ్ తప్పులు జరిగిందని దీని ఆధారంగానే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అధికారులను తప్పు పట్టవద్దని వైస్ ఎంపీపీకి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఫణికుమార్, మండల స్థాయి అన్నిశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**రామచంద్రాపురం, మేజర్‌న్యూస్:** మండలంలోని రాయల చెరువు పేటలో తిరుపతికి చెందిన డిఎన్ఆర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు డాక్టర్ నారాయణరెడ్డి, డాక్టర్ చైతన్య ,డాక్టర్ సంగీత వైద్య బృందం సుమారు వందమందికి పైగా వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. ఈ క్రమంలోనే తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి హాజరై వ్యాధిగ్రస్తులకు డాక్టర్ నారాయణరెడ్డి తో కలిసి ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆరోగ్యం పై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు తిరుమలరెడ్డి, మాధవి, నాగభూషణం, తెలుగుదేశం పార్టీ నాయకులు లోకనాథం యాదవ్, చిన్నబరెడ్డి, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.





## ఉచిత కంటి పరీక్ష శిబిరానికి భారీ స్పందన

### - 62 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక

**కుప్పం, మేజర్‌న్యూస్:** సాయి మాత సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వారిచే ఆదివారం కుప్పం పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్ నందు ఉచిత మెగా మెగా ఉచిత కంటి పరీక్షా శిబిరము నిర్వహించారు. ఈ శిబిరానికి దాదాపు 150 మంది కంటి రోజులు పరిశీలించిన డాక్టర్లు వీరిలో 62 మందికి కంటి ఆపరేషన్లకు గాను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి సోమవారం బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్‌లను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం శివ, లావణ్య, నేత్ర, మటా ర్లపల్లి వీరభద్రప్ప పాల్గొన్నారు.

## కల్కి అక్రమ కట్టడాలను కూల్చివేయాలి



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** బీఎన్ కండ్రిగ లోని కల్లిపెట్టు గ్రామం వద్ద అటవీ ప్రాంతంలో సర్వేనెంబర్ 295లో 230.75 ఎకరాలలో అక్రమంగా నిర్మించిన కల్కి ఆశ్రమం ఆక్రమించి కట్టిన కట్టడాలను వెంటనే ప్రభుత్వ అధికారులు కూల్చివేయలని హేతువాదు సంఘం రాష్ట్ర అధ్యక్షులు నార్ని వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫారెస్ట్ అధికారులతో కుమ్మక్కై కోట్లాది రూపాయలు విలువగలిన అటవీ భూమిని కల్కి ట్రస్ట్ వారికి ధారాదత్తం చేయాలని ప్రయత్నంచడం దారుణమన్నారు. అటవీ శాఖ నిబంధలను తుండలో తొక్కి చుట్టప్రక్కల అటవీ సంపదకు, అటవీ జంతువులకు, పక్షులకు నిఘాతం కలిగించేలా కల్కి ట్రస్ట్ వ్యవహరిస్తుందని, దీన్ని అటవీ శాఖ వారు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కల్కి ట్రస్ట్ అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, ట్రస్ట్ కు సహకరించిన అటవీ అధికారులను రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కల్కి ఆక్రమించిన భూములను తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. కల్కి ఆక్రమించిన దళితులు భూములను వారికి పంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హేతువాద సంఘ నేతలు డాక్టర్ ఏఆర్.రెడ్డి, వరదయ్యపాలెం కల్కి బాధితులు చంద్రశేఖర్, రాజయ్య పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం



**గూడూరు, మేజర్‌న్యూస్:** గురు పౌర్ణిమ సందర్భంగా సరస్వతీ శిశు మందిరం పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఆదివారం ఉదయం శిశు మందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బి వెంకట రమణారెడ్డిని ఘనంగా సన్మానం చేయటం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళి రెడ్డి సహ కార్యదర్శి మయూరి శ్యామ్ యాదవ్ తదితరుల పాల్గొన్నారు. సన్మాన గ్రహీత వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ గురువు విశిష్టత వివరిస్తూ వ్యాస భగవానుని గురించి వివరించారు. ఈ కార్యక్రమములో పాఠశాల సమితి సహ కారదర్శి యస్వి యల్ ప్రసాద్ సిహెచ్ వెంకట రమణయ్య ఆర్ రవిచంద్రరెడ్డి, రూపేష్‌రెడ్డి, ఆర్‌వి రావు, ప్రధానచార్యులు వి రంగనాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ



**గూడూరురూరల్, మేజర్‌న్యూస్:** రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పలసరుకుల పంపిణీ కార్యక్రమం డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ నందు నిర్వహించారు. ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసరా పథకం లో భాగంగా డాక్టర్ జనార్దన్ రెడ్డి, డాక్టర్ రోహిణి దాతృత్వంతో 20 మంది నిరుపేదలకు నెలకు సరిపడా సరుకులను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పేద విద్యార్థి చదువు కోసం ప్రాస్పరో స్కూల్ అధినేత దశరథరామిరెడ్డి రూ.12000 లు ఆర్థిక సహకారం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ పేట వెంకటకృష్ణారెడ్డి, మండి శ్రీనివాసుల రెడ్డి, దశరథ రామిరెడ్డి, సనత్ కుమార్ రెడ్డి, ధనంజయ రెడ్డి,ప్రజెంద్ర రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, రాఘవరెడ్డి, కిషోర్ రెడ్డి, హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మిత్రుడిని ఆదుకున్న పూర్వ విద్యార్థులు



**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** తమతో కలిసి చదువుకుని ప్రస్తుతం అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న చిన్ననాటి స్నేహితు షేక్ సిరాజ్ కు పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించి స్నేహం అనే పదానికి అర్థం తెలియజేశారు. నాయుడుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ లో 1982 సం"లో 10వ తరగతి బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు తమతో కలసి చదువు కొని నేడు అనారోగ్య రీత్యా బాధపడుతున్న షేక్ సిరాజ్ కు 45 వేల రూపాయలు నగదు సహాయం చేశారు. ఈ కార్యక్రమం లో ఆలురు శ్రీనివాసులు,చిట్టేటి అంకయ్య,శేషం ముని మనోహర్,కావేరిపాకం శ్రీనివాసులు,కె.యం.బాలాజీ,ఎం. సిద్దయ్య,జి.భాస్కర్, షేక్ రహమత్ భాష లు పాల్గొన్నారు. ఇటీవల తమ స్నేహితుడు గొట్టిముక్కల శ్రీనివాసరాచార్య మృతి చెందారని, దీనితో ఆయన భార్యకు 45 వేల రూపాయలు త్వరలో ఇవ్వనున్నట్లు పూర్వ విద్యార్థులు తెలియజేశారు.

## కుప్పంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**కుప్పం, మేజర్ న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం కుప్పంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్‌మర్మత్ తెలిపారు. సోమవారం కుప్పం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిడి పేర్కొన్నారు.

# ఘనంగా గురుపూజోత్సవ మహోత్సవం



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో వ్యాసపూర్ణిమను పురస్కరించుకుని వ్యాసభగవానుడి విగ్రహానికి గురుపూజోత్సవం నిర్వహించారు. ముందుగా వ్యాసమహర్షి ప్రతిమకు డా.అవధాని పూజలు నిర్వహించి గురుపూజోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. అద్వైత వేదాంత విభాగ అధ్యక్షులు ఐ.క్యు.ఎ.సి డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ ఆధ్వర్యంలో ఈ గురుపూజోత్సవం చేపట్టినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అజ్ఞానం తొలగించి విజ్ఞానాన్ని అందించే వారే గురువు. మానవ జీవన నిర్మాణంలో గురు పాత్ర అత్యంత ముఖ్యం. సత్యాన్ని బోధిస్తూ, ధర్మాన్ని కాపాడుతూ, న్యాయాన్ని సంరక్షిస్తూ ఉత్తమ వ్యక్తిగా ఏ విధంగా జీవించాలో బోధించేటువంటి మహా జ్ఞాని ఈ గురువు మాత్రమే. అందువల్ల విశ్వవిద్యాలయం విద్యార్థులందరూ కూడా గురుభక్తి, దేశభక్తి కలిగి చక్కగా అధ్యయనం చేస్తూ సంస్కృత సంరక్షణలో బాధ్యత కలిగి ముందుకు సాగాలని ఆయన వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ వై.వి కృష్ణారావు, విశ్వవిద్యాలయంలో విభిన్న విభాగాల అధ్యాపకులు, డా.కుమార్ బాగేవాడిమఠ్, డా. మనోజ్ షిండే, డా.నాగరాజు భట్, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు నడుం కట్టిన గ్రామస్తులు

## - ఎమ్మెల్యే నాని ఆదేశాలతో రోడ్డు వెడల్పు పనులు

**రామచంద్రపురం మేజర్‌న్యూస్ :** రాయల చెరువుకట్ట అనుపల్లి ప్రధాన రహదారిలో ఇటీవల రెండు రోడ్డు ప్రమాదాలు జరిగి ముగ్గురు మృతి చెందడంతో చెల్లించి పోయిన యన్ ఆర్ కమ్మ పల్లి గ్రామస్తులు, ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాలతో సొంత నిధులను వెచ్చించి ట్రాక్టర్లు జెసిబి యంత్రాలను ఉపయోగించి తిమ్మ రాజు పల్లి హరిజనవాడ నుంచి వేణుగోపాలపురం వరకు రోడ్డు వెడల్పు పనులు చేపట్టారు. గత ప్రభుత్వం రోడ్డు మరమ్మ పనులను పట్టించుకోకపోవడం తో రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లు ముండ్లపొదలు రోడ్డును సగం వరకు ఆక్రమించాయి. మలుపులు ఎక్కువగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు తెలియక ఢీకొనటం ,పలు ప్రమాదాలకు దారి తీయడం జరిగింది. గత వారం రోజుల్లో ముగ్గురు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాని గ్రామస్తులతో చర్చించి మరమ్మత్తులు చేయాలని కోరారు. గ్రామస్తులు దగ్గరుండి రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన ముండ్లపదలను తొలగించి మన్ను తోలి మరమ్మత్తులు చేపట్టారు. వర్షపు నీరు రోడ్డుపైన నిలవకుండా వెలు పలికి వెళ్లిపోవటానికి చర్యలు చేపట్టారు. దీంతో వాహనదారులకు కొంత వెసులుబాటు కలిగింది.




## గురువులను సత్కరించిన బీజేపీ నేత డా. చంద్రప్ప



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** గురు పౌర్ణమి సందర్భంగా బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప ఆదివారం శ్రీ శుకబ్రహ్మ ఆశ్రమం పీఠాధిపతులు శ్రీ విద్యా స్వరూపనందగిరి స్వామిని దర్శించుకుని సామిని సత్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. విద్యార్థి దశ నుండి బావి భారత పౌరులుగా తీర్చి దిద్దే గురువులను పూజించడం మన బాధ్యత. అధ్యక్షులు డా. చంద్రప్ప గురువు టి.వెంకటేశ్వరరావని వారి నివాసంలో గౌరవ పూర్వకంగా కలిసి నూతన వస్త్రాలు అందించి ఘనంగా సత్క రించి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా చంద్రప్ప మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు ను గౌరవించుకోవడం మన బాధ్యత అన్నారు.

# గోవర్ధన్ పురంలో మొక్కల పంపిణీ



**వరదయ్యపాలెం, మేజర్‌న్యూస్:** మండలంలోని గోవర్ధన్ పురంలోని లోక ఫౌండేషన్ కార్యాలయం వద్ద "అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి ప్రేమిం చినంతగా చెట్టు కూడా మనకు జీవితంలో ఉపయోగపడుతుందని చెట్టు యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ, మానవ జీవితానికి చెట్టుకు ఉన్న అవినాభావ సంబంధం గురించి వివరించారు. పర్యావరణంలో పెరుగుతున్న మార్పుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ కచ్చితంగా చెట్లు నాటే అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు. గురువుకు దేవుని కంటే ముందు స్థానాన్ని కల్పించిన సనాతన ధర్మం తెలిపిందని,అందుకే తల్లి, తండ్రి, గురువు, దైవం అంటారని అన్నారు. తన కంటే తన శిష్యుడు గొప్ప వాడు కావాలి అని కోరుకునే వారు గురువు అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు ఇలాంటి సామాజిక కార్యక్రమాలలో పాల్గొనడం ఆనందదాయకమని అన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా లోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో అరుణ్ జి మాట్లాడుతూ,తమ జీవితంలో విలువైన సందేశాలు నచ్చిన గురువులను స్మరించుకోవడం, గురు పౌర్ణమి గొప్ప విశేషంగా తెలియజేశారు. జీవితంలో యోగ బలమైన ప్రశాంతతకు గొప్ప వరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొప్పన రమేష్,ముని కృష్ణయ్య,గుత్తి త్యాగరాజు, సిద్దులయ్య, తడ శ్రీను,బొప్పన శ్రీను,ఖాదర్ భాషా, ఢిల్లీ ప్రకాష్,పురుషోత్తం,పుర ప్రముఖులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మకు సారె సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** చంద్రగిరి పట్టణంలో కొలువుదీరి ఉన్న గ్రామ దేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ తల్లికి ఎమ్మెల్యే పులివర్తి నాని,సుధా రెడ్డి దంపతులు ఆదివారం సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తమకు అఖండ విజయం చేకూర్చిన మూలస్థాన ఎల్లమ్మ తల్లికి సారెను తీసుకుని వచ్చిన ఎమ్మెల్యే దంపతులకు ఆలయ కార్యనిర్వహణ అధికారి పుట్ట రామకృష్ణారెడ్డి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి సారెను, పూజా సామాగ్రిని తలపైన పెట్టుకొని ఆలయ ప్రదక్షణతో అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. ఎమ్మెల్యే దంపతులతో పాటు నాయకులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి, శేషవస్త్రాలను బహుకరించి, ఆశీర్వచనాలు ఇప్పించారు. తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ పునర్నిర్మాణంలో జరుగుతున్న పనులను నిశితంగా పరిశీలించారు. పలు అంశాలపై అధికారులతో చర్చించారు. నిధులు ఎంతైనా పరవాలేదని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. నిధులు ఎంత అవసరమైన తాము సమకూర్చడానికి సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆలయంలో శిల్పకళను అందంగా రూపొందించాలన్నరు. మహిమాన్వితులైన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ తేజస్సు పెంచే విధంగా పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు.



**కుంభాభిషేక మహోత్సవ కమిటీ ఏర్పాటు...** మూలస్థాన ఎల్లమ్మ పునర్నిర్మాణ పనులు ఆఖరి దశలో ఉండటంతో అమ్మవారి కుంభాభిషేక మహోత్సవానికి కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే నాని ప్రకటించారు. ఈ కమిటీకి అధ్యక్షులుగా మొక్కల చంద్రశేఖర్ రెడ్డి (యంసిఆర్)ని, కమిటి సభ్యులుగా ఎం.గోపి, ఆర్. వెంకట ముని, కే.దుర్గా, డి.మునికృష్ణమ నాయుడు, పి.పాపమ్మ, జి.దేవి, ఎం.గోపాల్ రెడ్డి,యు. భారతిలను నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కుంభాభిషేక మహోత్సవ కమిటీ అందరినీ కలుపుకొని అమ్మవారి వైభవాన్ని దశ దిశల వ్యాపించే విధంగా పనిచేయగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కుంభాభిషేకం నభూతో, న భవిష్యత్ అన్న రీతిలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# శ్రీవారి ఆలయంలో వైభవంగా గరుడ సేవ





**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం రాత్రి 7 గంటలకు గరుడవాహన సేవ ప్రారంభమైంది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. వాహన సేవలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



# పుష్పయాగానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** నేటి నుంచి అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయలలో ఆదివారం రాత్రి పుష్ప యాగాన్ని శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ఉదయం ఆచార్య ఋత్విక్‌వరణం జరిగింది. సాయంత్రం 6.30 నుండి అంకురార్పణం నిర్వహించారు ఇందులో భాగంగా మేదినిపూజ, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ చేపట్టారు. ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్నవేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2.40 నుండి సాయంత్రం 5గంటల వరకు పుష్పయాగం జరుగనుంది. సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రమేష్, ప్రధానార్చకులు సూర్యకుమారాచార్యులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.



# ద్రౌపతి దేవి సమేత ధర్మరాజుల స్వామి అగ్నిగుండ మహోత్సవం

## కట్టుదిట్టమైన ఏర్పాట్లు దేవస్థానం ఈఓ ఎన్‌వీఎస్‌ఎన్,మూర్తి



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధం ద్రౌపతిదేవి సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా అగ్నిగుండమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ అగ్నిగుండ మహోత్సవానికి చుట్టు పక్కల ప్రాంతాలు నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో కంకణాలు కట్టుకుని అగ్నిగుండం ప్రవేశానికి సిద్ధమయ్యారు. ఉదయం దుర్యోధన వధ వంటి ఘట్టాలను కళాకారులు నిర్వహించారు. సాయంత్రం అగ్నిగుండం వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించి ద్రౌపతిదేవి ఒడిలో నిప్పు కనికలను పెట్టారు. అనంతరం ప్రధాన పూజారి పూల బంతిని అగ్నిగుండంలో విసిరిన తర్వాత నిప్పులు తొక్కారు. వెంటనేభక్తులు అగ్నిగుండంలో ప్రవేశం చేశారు. ఈ విశేష ఉత్సవాన్ని పురస్కరించుకొని పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయం భక్తజనసంద్రంగా మారింది. శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఈఓ ఎన్‌వీఎస్‌ఎన్.మూర్తి. ఆలయ అధికారులు అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకు తగుజాగ్రత్తలు తీసుకున్నప్పటికీ అగ్నిగుండం మహోత్సవంలో కొద్దిపాట తోపులాట జరగడంతో ఓ భక్తుడు అగ్నిగుండంలో పడడంతో అది గమనించి ఆభక్తున్ని అగ్నిగుండం నుంచి బయటికి తీయడంతో కొద్దిపాటి గాయాలయ్యాయి. అగ్నిగుడంలో పడినభక్తుడిని వైద్యచికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియాఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు. పోలీస్ సిబ్బంది. వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.





జనం కోసమే సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం.
మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232

ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

## ఘనంగా గురుపూజోత్సవ మహోత్సవం



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో వ్యాసపూర్ణిమను పురస్కరించుకుని వ్యాసభగవానుడి విగ్రహానికి గురు పూజోత్సవం నిర్వహించారు. ముందుగా వ్యాసమహర్షి ప్రతిమకు డా.అవధాని పూజలు నిర్వహించి గురుపూజోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. అద్వైత వేదాంత విభాగ అధ్యక్షులు ఐ.క్యు.ఎ.సి డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ ఆధ్వర్యంలో ఈ గురుపూజోత్సవం చేపట్టినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అజ్ఞానం తొలగించి విజ్ఞానాన్ని అందించే వారే గురువు. మానవ జీవన నిర్మాణంలో గురు పాత్ర అత్యంత ముఖ్యం. సత్యాన్ని బోధిస్తూ, ధర్మాన్ని కాపాడుతూ, న్యాయాన్ని సంరక్షిస్తూ ఉత్తమ వ్యక్తిగా ఏ విధంగా జీవించాలో బోధించేటువంటి మహా జ్ఞాని ఈ గురువు మాత్రమే. అందువల్ల విశ్వవిద్యాలయం విద్యార్థులందరూ కూడా గురుభక్తి, దేశభక్తి కలిగి చక్కగా అధ్యయనం చేస్తూ సంస్కృత సంరక్షణలో బాధ్యత కలిగి ముందుకు సాగాలని ఆయన వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ వై.వి కృష్ణారావు, విశ్వవిద్యాలయంలో విభిన్న విభాగాల అధ్యాపకులు, డా.కుమార్ బాగేవాడిమఠ్, డా. మనోజ్ షిండే, డా.నాగరాజు భట్, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

## సాయి నాధునికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**- పట్టు వస్త్రాలను సమర్పించిన చంద్రగిరి ఎమ్మెల్యే దంపతులు**





**చంద్రగిరి, మేజర్ న్యూస్:** ఎమ్మెల్యే పులివర్తి నాని, పులివర్తి సుధా రెడ్డి దంపతులు చంద్రగిరి బజారు వీధిలో పూజలు అందుకుంటున్న శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి మహోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం పండ్లు, పూలతో పాటు పట్టు వస్త్రాలను సమర్పించారు. గురు పౌర్ణమి మహోత్సవ వేడుకలకు ఆలయ పెద్దలు ఎమ్మెల్యే నానిని ఆహ్వానించారు. వారి ఆహ్వానం మేరకు ఆలయానికి చేరుకున్న పులివర్తి దంపతులకు ఆలయ పెద్దలు, కమిటీ సభ్యులు మంగళ వాయిద్యాలతో వేద పండితులు మంత్రోచ్చారణతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నాని దంపతులు పండ్లు,పూలతో పాటు పట్టు వస్త్రాలను శ్రీ షిరిడి సాయినాధునికి సమర్పించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించి, తీర్థప్రసాదాలను అందించి ఆశీర్వదించారు.శ్రీ షిరిడి సాయి నాధుని కృపా కటాక్షాలు ఎల్లవేళలా నియోజకవర్గ ప్రజలకు ఉండాలని ఎమ్మెల్యే సాయి నాధుని ప్రార్థించారు. ఈ గురు పౌర్ణమి వేడుకలలో ఆలయ పెద్దలు, కమిటీ సభ్యులు, భక్తులు, కూటమి పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** స్థానిక నెహ్రూ నగర్ లోని రాజరాజేశ్వరి ఆలయం వద్ద రేవా డయాబెటిస్ క్లినిక్ అధినేత డాక్టర్ రేఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్య రక్షణ కల్పించడానికి ఉచిత వైద్య సేవలు నిరూపిస్తున్నామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 500 మంది పాల్గొని ఉచిత వైద్య వైద్య పరీక్షలు అందుకుని, మందులు పంపిణీ చేశారు. డాక్టర్ కత్తుల రేఖ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్ ,బీపీ, వంటి జబ్బులు తీవ్రతరం దాల్చకుండా వుండడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అప్రమత్తం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పొన్నగంటి భాస్కర్, కొండేటి ప్రేమ్ కుమార్, జనసేన నాయకులు హరి, తెలుగుదేశం పార్టీ నాయకులు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన మహోత్సవం అగ్నిగుండం మహోత్సవం

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** కార్వేటి నగరంలో వెలసిన ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల భాగంగా ఆదివారం ఉదయం ఆలయంలో స్వామివారికి పుష్కరించి నీరు తీసుకుని వచ్చి అభిషేకం నిర్వహించారు. ఆలయం వద్ద హెూమం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం రెడ్డమ్మ భాగవత దారించే హరికథ కాలక్షపు నిర్వహించారు. ఆలయం వద్ద అగ్గి గుండాన్ని వెలిగించి, మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగళ్ళు పెట్టి నైవేద్యం సమర్పించరు. కంకణం ధరించిన వారు అగ్నిగుండాలకి ప్రవేశించారు. రాత్రి ఆలయం వద్ద అగ్నిగుండాలో ఉన్న అగ్గి ద్రౌపది అమ్మవారికి వడిభాలు కట్టిన తర్వాత పోతురాజు భక్తులు అగ్నిగుండంలోలోకి ప్రవేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పోకల సోమనాథ్, ప్రధాన కార్యదర్శి హరికుమార్, ఉపాధ్యక్షులు శివ ప్రకాష్, కోశాధికారి బాబు రెడ్డి, ఉప కోశాధికారి కృష్ణయ్య భక్తులు మహిళలు పాల్గొన్నారు. ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



# నాడార్‌లను బిసి కేటగరిలో చేర్చేందుకు కృషి : ఎమ్మెల్యే ఆరణి

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** నాడార్ లను బీసీ కేటగిరీలో చెర్చేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఆదివారం రాజీవ్ గాంధీ కాలనీలో నాలార్ కళ్యాణ మండపంలో కామరాజ్ నాడార్ 122వ జయంతి వేడుకలను తిరుపతి నాడార్ వెల్ఫేర్ అసోషియేషన్ ఘనంగా వేడుకగా నిర్వహించారు. నాడార్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షులు శివస్వామి నాడార్ మాట్లాడుతూ తమిళనాడులో నాడార్ కులం బిసిగా పరిగణిస్తున్నారని, ఆంధ్ర రాష్ట్రంలో కూడా బిసిలుగా నాడార్ లను గుర్తించాలని కోరారు. అలాగే తమిళ మీడియం స్కూల్ ను తిరుపతిలో పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. నాడార్ కళ్యాణమండపం ఆనుకుని మద్యం షాపు ఉందని దీన్ని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ కామరాజ్ నాడార్ బడుగు, బలహీనవర్గాలకు విద్యా, సామాజిక రంగాల్లో ప్రాధాన్యత కల్పించడంలో ఆయన విశేషకృషి చేశారని తెలిపారు. కామరాజ్ నాడార్ మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్నా చనిపోయేనాటికి నూటముప్పయ్ రూపాయలు మాత్రమే ఉన్నాయంటే ఆయన ఎంతటి సాధారణ జీవితాన్ని గడిపారో అనడానికి నిదర్శనమని ఆయన చెప్పారు. నాడార్ లను బిసీల్లో చేర్పించే అంశాన్ని సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తమిళ మీడియం స్కూల్ ను నగరంలో పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. కొత్త మద్యం పాలసీలో భాగంగా మద్యం షాపు నాడార్ కళ్యాణ మండపం వద్ద లేకుండా చూస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మన్యం శ్రీనివాసులు, కార్పొరేటర్ అన్నా అనితా యాదవ్, టిడిపి నగర మహిళా అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ, అన్నా మల్లీశ్వరి, బిజెపి నాయకులు నవీన్ కుమార్ రెడ్డి, జనసేన నాయకులు అత్తులూరి భాను, కృష్ణకాంత్, వంశీ, జిలానీ, నాడర్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు తంగరాజ్ నాడార్, ఉదయ సూర్యన్ పాల్గొన్నారు.



# స్థానిక ఆలయాల్లో సంప్రదాయాలను పునరుద్ధరిస్తాం: ఎమ్మెల్యే ఆరణి

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** నగర పరిధిలోని ఆలయాలలో సంప్రదాయాలను పునరుద్ధిస్తామని ఆరణి శ్రీనివాసులు తెలిపారు. గురుపౌర్ణమి సందర్భంగా రాఘవేంద్రనగర్ షిర్డీ సాయిబాబా గుడిలో జరిగిన పూజాకార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆలయ ఎమ్మె పాలకమండలి సభ్యులు ఎమ్మెల్యేకి స్వాగం పలికి స్వామి దర్శనం చేయించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని పాలకమండలి సభ్యులను ఎమ్మెల్యే సూచించారు. అనంతరం తుమ్మలగుంట రోడ్డు లోని శ్రీ సాయి రెసిడెన్సీ అపార్ట్మెంట్ లో జరిగిన గురుపౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. అపార్ట్మెంట్ అసోషియేషన్ సభ్యులు ఎమ్మెల్యకి దర్శనం కల్పించారు. అలిపిరి గరుడ విగ్రహం సమీపంలో గురు పౌర్ణమి సందర్భంగా జానపద వృత్తి కళాకారుల సంఘం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుమల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రక్షాళన మొదలు పెట్టారని అన్నారు. టిటిడి ధర్మప్రచారపరిషత్ గత ఐదేళ్ళలో నిలిపేసిన సంప్రదాయలన్నిటిని పునరుద్ధరిస్తామని తెలిపారు. జానపద కళాకారుల సమస్యలను సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి క్లస్టర్ ఇన్చార్జీ శ్రీహరి నాయుడు, మహేష్ యాదవ్, జానపద వృత్తి కళాకారుల జాతీయ అధ్యక్షులు యాదగిరి, కార్యదర్శి ముని, జనసేన నాయకులు నరసింహులు నాయుడు, రాజారెడ్డి పాల్గొన్నారు.



# నయనానందకరం" అభినయ నాటక, నృత్యోత్సవం

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** అభినయ ఆర్ట్స్ 24వ వార్షికోత్సవం సందర్భంగా మహతి కళాక్షేత్రంలో ఆదివారం ప్రదర్శించిన పౌరాణిక పద్యనాటకం, సాంఘిక నాటిక, శాస్త్రీయ, జానపద నృత్యోత్సవాలు నయనందాకరంగా సాగాలి అభినయ ఆర్ట్స్ జాతీయ స్థాయి నాటక పోటీల్లో భాగంగా రెండవ రోజైన ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు సాగాయి. ఇందులో అత్యధిక సంఖ్యలో కళాబృందాలు పాల్గొని తమదైన శైలిలలో నృత్యాభినయం చేస్తూ ప్రేక్షకులను అలరింపజేశారు. అనంతరం. మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్కు చెందిన రసరంజని కళాకారులు సచికేత పౌరాణిక పద్యనాటకాన్ని ప్రదర్శించారు. యముడికి, సచికేతుడికి మధ్య జరిగిన సంవాదం ఇతి వృత్తంగా సాగిన ఈ నాటకం అధ్యాంతం ఆధ్యాత్మిక భక్తి పారవశాన్ని నింపింది. ఆధ్యాత్మిక భావాలను ప్రస్తుత సమాజంలో జరుగుతున్న మానసిక స్థితిగతులకు వర్తింపజేసి అద్భుత రీతితో ఆవిష్కరించి ప్రేక్షకుల ఆలోచనాలను రేకెత్తించారు. అనంతరం కాకినాడుకు చెందిన గరికిపాటి రాజారావు కళానికేతన్ వారు ప్రదర్శించిన ఆకాంక్ష సాంఘిక నాటిక మేల్కొలుపును కలిగించింది. ఈ నాటిక ఓ మధ్యతరగతి కుటుంబంలో జరిగే సంఘటనలను ఇతి వృత్తంగా చేసుకొని ఆ కుటుంబ జీవితాలలోని సంఘర్షణలను ఆవిష్కరించి వాటిని ఎదుర్కొనే విధానాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించి ప్రేక్షకులను మేల్కొలుపు కలిగించారు. రాత్రి పాలకొల్లుకు చెందిన నటీనది. సమాఖ్య వారు అనూహ్యం సాంఘిక నాటిక ప్రదర్శించారు. ఈ నాటిక ద్వారా కళాకారులు తల్లిదండ్రులు వారసత్వ సంపదను, కష్టార్జితాన్ని కన్న కొడుకులు హక్కుల పేరుతో కుటిల నీతితో వ్యూహాత్మకంగా దక్కించుకొని వారిని కష్టాలు పాలు చేసే సంఘటనలను అద్భుత రీతిలో ఆవిష్కరించి ప్రేక్షకులకు చక్కటి.. సందేశాన్ని అందించారు. జీవిత చరమాంకంలో మనోధైర్యంతో, ఆనందంగా ప్రశాంతంగా జీవించాలంటే. ప్రతి తండ్రీ, తల్లీ అనూహ్యమైన వ్యూహాలతో ముందుకు సాగుతూ ఆనందభరిత జీవితాలను గడపాలనే సందేశంతో నాటకం సాగుతూ ప్రేక్షకుల్లో ఆలోచనలను రేకెత్తించింది. ఈ సందర్భంగా నృత్యాలు, నాటకాలు ప్రదర్శించిన కళాబృందాలను అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎన్. రెడ్డి జ్ఞాపికలు, శాలువలతో ఘనంగా సత్కరించి అభినందించారు.



